క్లుప్తంగా

జోడోయాత్రకు భయపడే వేటేశారు



మోర్తాడ్(బాల్కొండ): రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్రకు భయపడే అన్యాయంగా బీజేపీ నేతలు అనర్హత వేటు వేయించారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మార చంద్రమోహన్ ఆరోపించారు. ఆదివారం ఏర్గట్ల మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కేవలం పెట్టుబడిదారులకు వత్తాసు పలికి పేద ప్రజలను నిలువునా మంచుతోందని విమర్శించారు. ఏర్గట్ల మండల అధ్యక్షులు దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గంగా ప్రసాద్, నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివనోళ్ల శివ, తదితరులు పాల్గొన్నారు

ఆర్థిక చేయూత



కమ్మర్‌పల్లి: ఏర్గట్ల మండలం గుమ్మిర్యాల్‌కు చెందిన ఆరెపల్లి శ్రీనివాస్‌కు ఇజ్రాయెల్ వలస కార్మికులు ఆర్థిక చేయూత అందించారు. శ్రీనివాస్ కొన్ని నెలల క్రితం దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఇజ్రాయెల్ శాలివాహన సంఘం సభ్యులు గుగ్గిళ్ల దేవరాజ్, గణేష్, తదితరులు కలిసి రూ.50 వేల ఆర్థిక సహాయం అందించగా, దేగం యాదాగౌడ్, అశోక్ ఆదివారం గుమ్మిర్యాల్‌కు వెళ్లి శ్రీనివాస్‌కు నగదును అందజేశారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో చేపడుతున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి స్థానిక దాత డాక్టర్ మోరె రాజేశ్వర్ రూ.50 వేల విరాళం అందించారు. ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. బద్రి, సుభాష్‌గౌడ్, గణేష్, హరీష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టాక్లీకి స్పీకర్ రాక

రుద్రూర్ : పోతంగల్ మండలంలోని టాక్లి గ్రామానికి సోమవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి వస్తున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్ తెలిపారు. టాక్లీ గ్రామంలో రూ. కోటితో ని ర్మించిన బ్రిడ్జి, సాలం పాడ్ రోడ్డును ప్రారంభిస్తారని, అనంతరం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని వెల్లడించారు. గ్రామంలో ని ర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సీసీ రోడ్లను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి డీసీ సీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బాన్సువా డ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి హాజరవుతున్నారని వెల్లడించారు.

బీమా చెక్కు అందజేత

రుద్రూర్: రాయకూర్ క్యాంపునకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కిష్టయ్య వ్యవసాయ కూలి పనికి వెళ్లి కొన్ని నెలల క్రితం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. మంజూరైన బీమా చెక్కును ఆదివారం తిమ్మాపూర్‌లో బాధిత కుటుంబానికి అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రుద్రూర్ మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు మస్తాన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కృషితో గతంలో ట్రాన్స్‌కో ద్వారా రూ.5 లక్షలు, ప్రస్తుతం బీఆర్ఎస్ ద్వారా రూ.2 లక్షలు బాధిత కుటుంబానికి అందాయని తెలిపారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి



రుద్రూర్: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఎలాంటి భయం పెట్టుకోవద్దని స్థానిక ఎంపీటీసీ కొట్టం మనోహర్ విద్యార్థులకు సూచించారు. కోటగి రి మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌కు ప్రభు త్వ సరాఫరా చేసిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఆ దివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధర్ రావ్ దేశ్‌ముఖ్, హాస్టల్ వార్డెన్ నరహరి ఉన్నారు.

దోమతెరల పంపిణీ



రెంజల్(బోధన్): సాటాపూర్‌లో పది సంవత్సరాల లోపు వయసు పిల్లలున్న కుటుంబాలకు ఆదివారం కాంగ్రెస్ నాయకులు దోమ తెరలను పంపిణీ చేశారు. నియోజకవర్గ నాయకుడు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి అందించిన దోమతెరలను మండల నాయకులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ అందించారు. కార్యక్రమంలో చిన్నోళ్ల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపం

- వారం రోజులకే సీసీ రోడ్లలో ఏర్పడుతున్న పగుళ్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు



సీసీ రోడ్డు నిర్మాణానికి ఇసుకకు బదులు కంకర పొడి ఇతర మెటీరియల్ కలిపి వేస్తున్న దృశ్యం

మాక్లూర్ : అడిగే వారు లేరన్న ధీమాతో గుత్తేదారులు అడ్డగోలుగా సీసీ రోడ్లు వేశారు. అంతే కాకుండా వేసిన రోడ్లకు నీరు పట్టకుండా అలాగే వదిలేశారు. ఫలితంగా వారం రోజులకే పగుళ్లు ఏర్పడిన సీసీ రోడ్లు మండలంలో పలు చోట్ల దర్శనమిస్తుండటంతో స్థానిక జనం గుత్తేదారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2022– 23గాను మండలానికి ఎన్ఆర్‌జీఎస్ నుండి రూ.6 కోట్ల 90 లక్షల నిధులు వచ్చాయి. ఇందులో రూ.60 లక్షలు డ్రైనేజీలకు కేటాయించగా మిగితా రూ.6 కోట్ల 30 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. అందులో మాక్లూర్‌కు రూ.2 కోట్లు, గుంజ్లీ గ్రామానికి రూ.కోటి 30 లక్షలు కేటాయించి మిగితా రూ.3 కోట్లను 24 జీపీలకు రూ.10 లక్షల చొప్పున, మరో 4 పెద్ద జీపీలకు రూ.15 లక్షల చొప్పున కేటాయించారు. మార్చి 31నాటికి సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు ఉండటంతో రాత్రి, పగలు తేడా లేకుండా ఆగమేఘాల మీద సీసీ రోడ్లు పూర్తి చేశారు. దీన్నే అవకాశంగా తీసుకున్న గుత్తేదారులు, సంబంధిత ఏఈతో కుమ్మక్కై నాసిరకంగా పనులు పూర్తి చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. జనం నాసిరకం పనులపై నిలదీస్తున్నా పట్టించుకోకుండా..పని చేయకపోయినా చేసినట్టు ఎంబీ రికార్డు చేసి బిల్లులు ఇప్పించే అధికారి ఉండగా మనకేంటి అన్న ధోరణిలో గుత్తేదారులు కన్పిస్తున్నారు.

నాణ్యతా లోపంతో సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని పంచాయితీరాజ్ ఏఈకి తెలిసినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ విషయమై వివరణ తీసుకునేందుకు మూడు రోజులుగా పలుమార్లు సంబంధిత పంచాయితీ రాజ్ ఏఈ శ్రీనివాస్‌కు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు.



వేసిన వారం రోజులకే పగుళ్లు కన్పిస్తున్న సీసీ రోడ్లు



మాక్లూర్ మండలంలో నీరు పోయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

రాహుల్‌పై అనర్హత వేటు సరికాదు



మాట్లాడుతున్న కో–ఆర్డినేటర్ కరుణాకర్‌రెడ్డి

ఎడపల్లి(బోధన్):కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్లమెంట్‌లో అదానీ అంశంపై నిలదీస్తారనే ఉద్దేశంతో బీజేపీ ప్రభుత్వం అనర్హత వేటు వేసిందని కాంగార్ కరంచారి కాంగ్రెస్(కేకేసీ) నేషనల్ కో–ఆర్డినేటర్ కరుణాకర్ రెడ్డి అన్నారు. ఎడపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కుల మతాలను విడగొట్టి, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి దేశ సంపదను కొల్లగొడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని ఎంతగా తొక్కాలని చూస్తే రెట్టింపు శక్తితో ప్రజల ముందుకు వస్తుందని వ్యాఖ్యానించారు.

తెలంగాణ ప్రదేశ్ కేకేసీ కో–ఆర్డినేటర్‌గా శంకర్

కేకేసీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్ ఆదేశాల మేరకు కేకేసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్‌గా శంకర్‌నాయుడిని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షులుగా భాస్కర్‌రాజు, కేకేసీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రమేష్‌రెడ్డి, నిజామాబాద్ జిల్లా స్ట్రీట్ వెండార్‌గా ఖాయాఫయామొద్దీన్‌లను నియమించారు.

బీఆర్ఎస్‌కు దీటుగా ఫ్లెక్సీలు పెడతాం



మాట్లాడుతున్న జీవీ నర్సింహారెడ్డి

ఆర్మూర్‌టౌన్: బీఆర్ఎస్ నాయకులు ఇష్టారీతిన ఫ్లెక్సీలు పెడితే దానికి దీటుగా బీజేపీ నాయకులు కూడా ఫ్లెక్సీలు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని ఈ విషయంలో ఎక్కడా తగ్గేదేలేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కౌన్సిలర్ జీవీ నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. ఆర్మూర్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై లేని పోని మాటలతో ఫ్లెక్సీలు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో కేసీఆర్ ఎన్నో హామీలు ఇచ్చారని, ఆ హామీలను ముందుగా నెరవేర్చిన తర్వాతే ఎంపీ అరవింద్‌పై మాట్లాడాలని సూచించారు. ఎంపీ అరవింద్ తాను ఇచ్చిన మాట ప్రకారం పసుపు బోర్డుతో కూడిన స్పైసెస్ బోర్డును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. సమావేశంలో బీజేపీ నేతలు జెస్సు అనిల్, ధోండి ప్రకాష్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఏఐఎస్‌బీ నేత నాగరాజ్

బోధన్: పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్‌బీ(ఆలిండియా స్టూడెంట్ బ్లాక్) రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగరాజ్, అధికారులను కోరారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు రాజన్న, గంగా ప్రసాద్, శ్రీను, భానులు పాల్గొన్నారు.

పట్టుదల పాటు క్రమశిక్షణతో చదవాలి



కాన్వకేషన్ సర్టిఫికెట్లతో విద్యార్థులు.. వెనుక మండల విద్యాధికారి, ఆచార్య పాఠశాల యాజమాన్యం

బోధన్‌టౌన్(బోధన్):విద్యార్థులు పట్టుదలతో పాటు క్రమశిక్షణతో చదవాలని ఎంఈవో నాగ్‌నాథ్ అన్నారు. ఆచన్‌పల్లిలోని ఆచార్య విద్యాలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని, బంగారు భవిష్యత్తు కోసం మొక్కవోని దీక్షతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు కాన్వకేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.



భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో ప్రకృతి ఆశ్రమం ఇన్‌చార్జి సాయిలు, పాఠశాల డైరెక్టర్ బోనాల బలరాం రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బోనాల సంధ్యా రెడ్డి పాల్గొన్నారు.



బోధన్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఆర్మూర్‌చర్చిలో మట్టలతో ప్రత్యేక ప్రార్థనలు..

ఘనంగా మట్టల పండుగ

బోధన్, ఆర్మూర్ పట్టణాల్లోని సీఎస్ఐ చర్చిలలో ఆదివారం మట్టల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిల నుంచి ర్యాలీలు నిర్వహించారు. అనంతం చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించి భక్తులనుద్దేశించి మాట్లాడారు. పండుగ విశిష్టత గురించి పాస్టర్లు వివరించారు. ప్రతీ ఒక్కరు ప్రేమ, శాంతి, సేవా మార్గంలో నడవాలని బోధన్‌లో పాస్టర్ రెవరెండ్ ప్రభాకర్ అన్నారు. –బోధన్ టౌన్/ఆర్మూర్ టౌన్

'జిల్లా'కు రాజకీయ పార్టీల మద్దతు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన ఉద్యమానికి అన్ని రాజకీయ పార్టీల నుంచి మద్దతు లభిస్తోందని న్యాయవాదులు తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 105వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు సీహెచ్‌వీ హన్మంత్‌రావు, అద్లూరి శ్రీనివాస్‌లు కూర్చున్నారు.

మేడి పాపయ్య నియామకంపై హర్షం



బోధన్: టీఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్యను మహనీయుల జయంతోత్సవ రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. విద్యాసాగర్ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఆయన మాట్లాడారు. సంఘ పట్టణ అధికార ప్రతినిధిగా కె. మహేందర్‌ను నియమించినట్లు ప్రకటించారు. ఈ నెల 5న జగ్జీవన్ రాం జయంతిని విజయవంతం చేయాలన్నారు.

పాపన్న గౌడ్ వర్ధంతి



రెంజల్(బోధన్): సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని మండలంలోని బాగేపల్లిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల గౌడ సంఘం అధ్యక్షుడు ఆగంటి సాయిబాబాగౌడ్ ఆధ్వర్యంలో పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం ప్రతినిధులున్నారు.

ఫ్లెక్సీల తొలగింపు

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచురించిన ఫ్లెక్సీలను శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మండల కేంద్రంలో ఏర్పాటు చేశారు. నాలుగు ప్రదేశాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గమనించిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఉదయం తొలగించారు. దొంగచాటు రాజకీయాలు చేయొద్దని, దమ్ముంటే చర్చలకు రావాలని ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకులు తెడ్డు పోశెట్టి మండిపడ్డారు.

పద్మశాలి నూతన కార్యవర్గాల ఎన్నిక



బోధన్/బోధన్ టౌన్: పద్మశాలి కుల సంఘం బోధన్ నియోజక వర్గ నూతన కార్యవర్గాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం హన్మాండ్లు పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని సంఘ భవనంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య ప్రతినిధులు, సభ్యుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా ప్రభుదాస్, అధ్యక్షుడిగా మేక సంతోష్, ఉపాధ్యక్షులుగా ఆడెపు అంజలి, నర్సయ్య, మోహన్, ప్రధాన కార్యదర్శిగా లోకం శ్రీనివాస్, కార్యదర్శులుగా గంగుల విజయ, మార దేవిదాస్, తదితరులను ఎన్నుకున్నారు.

కందకుర్తి కార్యవర్గం

రెంజల్(బోధన్): కందకుర్తి పద్మశాలి మార్కండేయ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటైంది. సంఘం ప్రతినిధులు సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జల్ల శ్రీనివాస్, లోల గంగాధర్, ఉపాధ్యక్షుడిగా గంగుల దేవిదాస్, సహాయ కార్యదర్శిగా స్వామి, కోశాధికారిగా మైత్రి మోహన్, సలహాదారులుగా బైర్ బత్రి రమేష్, గంగాప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా గణపతి ఎన్నికయ్యారు.

అటెన్షన్ ప్లీజ్..

గుంత ఉంది చూసి నడవగలరు..!



చిన్నబజార్‌లో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

పట్టణంలోని చిన్న బజార్‌లో రోడ్డు పక్కన ప్రమాదరకంగా గుంత ఉంది. రాత్రి సమయంలో అక్కడ ఉన్న గుంత కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – ఆర్మూర్‌టౌన్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: ప్రసాద్‌చౌహాన్
మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఫోన్ నంబర్ :
98499 04276

మాక్లూర్‌లో ఐదు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

మాక్లూర్: ఈ నెల 3నుంచి 13వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగే పదో తరగతి పరీక్షల్లో భాగంగా మండలంలో 5 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి తగిన సౌకర్యాలు కల్పించినట్టు ఎంఈవో రాజ్‌గంగారెడ్డి ఆదివారం తెలిపారు. మొత్తం 552 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. 42 మంది ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించనున్నారు. మదన్‌పల్లి, మాణిక్‌భండార్, మాక్లూర్, కల్లెడి, గుత్ప పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసి ఏర్పాట్లు కూడా పూర్తి చేశామన్నారు.

అలాగే మండలంలోని కొత్తపల్లికి చెందిన 10 మంది, గుంజ్లీకి చెందిన నలుగురు విద్యార్థులకు పరీక్ష సెంటర్ నందిపేట మండలం ఐలాపూర్ లో ఉంటుంది. చిక్లీ శివారు వల్లభాపూర్ చౌరస్తాలో ఉన్న బ్రిలియంట్ పాఠశాలకు చెందిన 74 మంది విద్యార్థులకు నవీపేట మండలం జన్నేపల్లిలో పరీక్ష సెంటర్ ఉంటుందని ఎంఈవో తెలిపారు.

భారీ వాహనాలను దారి మళ్లించండి



బోధన్‌టౌన్(బోధన్): పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం నుంచి పట్టణంలోనికి వచ్చే భారీ వాహనాలను దారి మళ్లించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్ రెడ్డి కోరారు. ఆదివారం పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద పికెటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుపై ఫిర్యాదు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పెర్కిట్‌లో మోడల్ స్కూల్ వెనకాల నిర్మించిన 26 ఇళ్ల రోడ్డు మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటును నిలిపివేయాలని పెర్కిట్ విద్యుత్ ఏడీఈ రాజేశ్వర్‌కు సాత్‌పుతే గణేష్ గౌరవ్ ఆదివారం ఫిర్యాదు చేశారు. ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెంచర్ యజమానులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు మధ్యలో కాకుండా ఈ వెంచర్‌లో (26 ఇండ్ల కోసం) మున్సిపాలిటీకి వదిలిన 10 శాతం ఖాళీ స్థలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

గోవింద్‌పేట్‌లో శాకాహార ర్యాలీ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో ఆదివారం పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మూవ్‌మెంట్(పీఎస్ఎస్ఎం) ఆధ్వర్యంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఆస్నూరి నరేంద్ర ముఖ్య అతిథిగా హాజరై శాకాహారం విశిష్టత, ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. పీఎస్ఎస్ఎం నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు నల్ల గంగారెడ్డి, పిరమిడ్ మాస్టర్లు సునీత జితేందర్ రెడ్డి, న్యాయవాది సాయి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హన్మాన్ యాత్రను విజయవంతం చేయండి



కమ్మర్‌పల్లి: బాల్కొండ మండల కేంద్రంలో ఈ నెల 5న బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించే వీర హన్మాన్ విజయ యాత్రను విజయవంతం చేయాలని బజరంగ్ దళ్ జిల్లా సహాయ కార్యదర్శి యోగేష్, బాల్కొండ ప్రఖండ అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. ఆదివారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని బ్రహ్మంగారి గుట్ట జంబి హన్మాన్ దేవాలయ ప్రాంగణంలో ఈ మేరకు కరపత్రాలు, బైక్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. వీహెచ్‌పీ నేతలూ ఉన్నారు.

ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో యజ్ఞం

నవీపేట: మండల కేంద్రంలోని పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం వైదిక యజ్ఞం నిర్వహించారు. లోక కల్యాణానికి, వాతావరణ కాలుష్య నివారణకు యజ్ఞం తోడ్పడుందని ఈ సందర్భంగా వేద పండితులు పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు కోసం వారానికొకసారి ఈ వైదిక యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆర్య సమాజ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంతాల్లో ఊరేగించనున్నామన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో పూర్ణాహుతి



మోస్రా రామాలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు.. హాజరైన భక్తులు

రుద్రూర్: మోస్రా మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవాలయ ధర్మకర్త పోచారం శంభు రెడ్డి, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయ్ కిషోర్ దంపతులు హాజరై పూజలు చేశారు.